క్లుప్తంగా

నేడు కల్యాణోత్సవం

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండలంలోని కోదండాపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం తెల్ల వారుజామున స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్ పేర్కొన్నారు. కల్యాణోత్సవానికి మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఉర్సుకు హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానాన్ని అందజేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

చింతపల్లి : మండల పరిధిలోని పీకే మల్లేపల్లి గ్రామంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న అజహరత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉర్సు, శ్రీ గిరి మక్కా మహేశ్వరస్వామి వారి వార్షికోత్సవ కార్యక్రమాలకు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను ఆహ్వానిస్తూ దర్గా కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ కెవి.రమేశ్‌రాజు, జానిమియా, సయ్యద్‌పాషా, యూసుఫ్‌పాషా, మార్కెట్‌కమిటి వైస్ చైర్మన్ గోపిడి కిష్టారెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన నాగేందర్ ఇటీవ అనారోగ్యంతో మృతిచెందాడు. పేదరికంలో మగ్గుతున్న అతడి కుటుంబానికి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూ.20వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ కన్వీనర్ బావండ్ల పాండు, నాయకులు కేసు వెంకటేశం, చిలుకూరి బాలు, జిల్లా భీక్షం, రాంబాబు, రమప్రసాద్ పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ వర్కర్స్ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మిర్యాలగూడ : దామరచర్ల మండల సీఐటీయూ అనుబంధ బైక్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్‌కె.భాషా, సహాయ అధ్యక్షుడిగా రామకృష్ణతోపాటు మరికొందరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ మాట్లాడుతూ రోడ్ల వెంట చిన్నచిన్న షెడ్డులు వేసుకుని బైక్‌లు రిపేర్ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న మెకానిక్‌లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం మెకానిక్‌లకు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇళ్ల స్థలాలు ఇవ్వాల న్నారు. ఈ కార్యక్రమంలో పాపానాయక్, వినోద్‌నాయక్, రమేష్, భాస్కర్, షబ్బీర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎల్లేశ్



ఎల్లేశ్‌కు నియామక పత్రం అందజేస్తున్న వంగపల్లి శ్రీనివాస్

దేవరకొండ : ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ నియోజకవర్గానికి చెందిన ముదిగొండ ఎల్లేశ్ నియామకమయ్యారు. ఆదివారం ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఎల్లేశ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లేశ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

18న శనిత్రయోదశి పూజలు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని తులసీనగర్ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 18న శని త్రయోదశి సందర్భంగా శని పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శని పూజలకు దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

చెత్త కుండీలుగా ఖాళీ ప్లాట్లు

- చెత్తా చెదారంతో నిండుతున్న ఖాళీ స్థలాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



చెత్తాచెదారంతో నిండిన ఖాళీ స్థలం

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ ప్లాట్లు, స్థలాలు చెత్త కుండీలుగా మారుతున్నాయి. దీంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవరకొండ మున్సిపాలిటీగా ఏర్పాటయ్యాక రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. దీంతో శివారు ప్రాంతాల్లో వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో ఉన్న ఖాళీ ప్లాట్లలో ఎలాంటి మురుగు, వర్షపు నీరు, పిచ్చి మొక్కలు పెరగకుండా సంబంధిత స్థల యజమానులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కాగా మున్సిపాలిటీ పరిధిలో మాత్రం యజ మానులు పట్టించుకోవడం లేదనే విమర్శలు స ర్వత్రా విన్పిస్తున్నాయి. కాగా సంబంధిత మున్సిపల్ అధికారులు గతంలో పట్టణ ప్రగతిలో భాగంగా ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు.ఇదిలా ఉంటే ఇప్పటికే మున్సిపల్ అధికారులు సంబంధిత ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు సైతం జారీ చేశారు.ఖాళీ ప్లాట్లలో విచ్చల విడిగా చెత్తా చెదారాన్ని పడవేస్తుండడంతో పరిసరాలు దెబ్బతింటున్నాయని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ స్థలాలకు పన్ను

ఖాళీ స్థల పన్ను (వీఎల్‌టీ)ని ఆ స్థలం యజమానులు మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంటుంది. డాక్యుమెంట్ వ్యాల్యులో 0.5శాతం కట్టాల్సి ఉంటుంది. అంటే లక్ష విలువ చేసే స్థలానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఇప్పటి వరకు మున్సిపాలిటీకి సుమారు 1000 మందికి పైగా ఖాళీ ప్లాట్ల యజమానులు వీఎల్‌టిని కట్టినట్లు తెలుస్తుంది. మిగతా మరికొంత మంది వీఎల్‌టి కట్టిన దాఖలాలు మచ్చుకైనా కన్పించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే నోటీసులకు స్పందించని వారికి జరిమానాలు సైతం విధించేందుకు సంబంధిత మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగో పట్టణ ప్రగతిలో భాగంగా పలువురికి నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు చోట్ల ఈ సమస్య ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలుపుతున్నారు. కాగా మొదటగా నోటీసులు జారీ చేసి స్పందించని నేపథ్యంలో రూ.2వేల నుంచి రూ.5వేల వరకు జరిమానాలను విధించనున్నట్లు కమిషనర్ వెంకటయ్య పేర్కొన్నారు.

నోటీసులు జారీ చేశాం



మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాల యజమానులకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు సూచించాం. ఇందుకు సంబంధించి పట్టణ ప్రగతిలో సైతం పలువురికి నోటీసులు జారీ చేశాం. ఖాళీ ప్లాట్ల యజమానులు తగిన చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్లాట్లలో చెత్తా..చెదారం ఉండకుండా చూసుకోవాలి. లేని పక్షంలో జరిమానాలు విధించాల్సి వస్తుంది. పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలి.

– వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్,దేవరకొండ

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జున సాగర్) : క్రీడలతో నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కొంపల్లి గ్రామంలో హిందువాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా గ్రామీణ స్థాయి కబడ్డీ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని అందులో భాగంగానే ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కొంపల్లి, రెండో బహుమతి అనుముల, మూడో బహుమతి తిరుమలగిరి గ్రామాలు గెలుచుకున్నాయి. గెలుపొందిన ఆయా జట్ల క్రీడాకారులకు నగదు, షీల్డ్‌లను అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, జెడ్పీటీసీ ఆంగోతు సూర్యబాషా నాయక్, వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, నడ్డి లింగయ్య, కేశావత్ జ్యోతిరామకృష్ణ నాయక్, నాయకులు అల్లి పెద్దిరాజు, ఉప సర్పంచ్ లింగాల మొగలయ్య, శ్రీనాథ్, సజ్జన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో బీసీ కులాలను చేర్చొద్దు



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధునాయక్



తిరుమలగిరి : కరత్రాలను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

మిర్యాలగూడ : రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో ఎస్టీ కులం జాబితాలో ఇతర కులాలను కలిపే తీర్మానం చేసి కేంద్రానికి పంపడం దారుణమని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధనావత్ సిద్ధునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటికి తండాలు సరైన సదుపాయాలు లేవని, కొన్ని తండాల్లో కూడు, గుడ్డ లేకుండా అనేక మంది గిరిజనులు జీవించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలకు రిజర్వేషన్ అమలు చేయకుండా, పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కాగా ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేరిస్తే ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనావత్ చందునాయక్, నాయకులు ఆడావత్ రామునాయక్, ఇస్లావత్ శివనాయక్, నాగరాజునాయక్, చంటినాయక్, కిరణ్‌నాయక్, మునినాయక్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : బీసీ జాబితా లో ఉన్న పలు కులాలను ఎస్టీ తెగల జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని ఎల్లాపురం తండాలో స్థానిక సర్పంచ్ కొర్ర బిక్షా నాయక్‌తో కలిసి కరత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల్లో పాలక పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎస్టీ జాబితాలో ఇతర కులాలను ఉమ్మడి రాష్ట్రం నుంచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొర్ర దేవు నాయక్, గిరిజన సంఘం నాయకులు రాజు, అశోక్, బాలు. మోతీలాల్,స్వామి, మాంగ్యా, ముని, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం



బాబుసాయి పేటలో వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



కల్యాణానికి హాజరైన భక్తజనం

త్రిపురారం : మండలంలోని బాబుసాయి పేటలో సుమారు 800సంవత్సరాల కిందట శ్రీ కృష్ణదేవారాయులు కాలంలో నిర్మించిన అతి పురాతన దేవాలయంలో వెలసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ ముఞ్వా వేణుగోపాల స్వామి వారి కల్యాణం గ్రామస్తుల ఆర్థిక సహకారంతో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన పూజారులు వంశీకృష్ణమాచార్యులు, కనగాల రాజ శేఖర్ శర్మ, రాధా మాదవ్‌ల సమక్షంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ ఉదయం ముందుగా ఏదుర్కొల్ల కార్యక్రమం నిర్వహించిన అంనతంరం కల్య అనంతరం కళ్యాణ కార్యక్రమం జరిపించారు. సమీప గ్రామాలైన దుగ్గెపల్లి, కంపాసాగర్, పెద్దదేవుల పల్లి, నర్లకంటి గూడెం, త్రిపురారం, చిల్లాపురంలోని భక్తులు అధిక సంఖ్యలో కళ్యాణానికి హజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తోటి పూర్వ స్నేహితులు 25 మంది కలిసి సుమారు 600 మంది భక్తులు అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళల కోలాటాలు, సాంస్కృతికి నృత్యాల నడుమ స్వామి వారిని వీధుల వెంట ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ చైర్మన్ గోపగాని శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకలు మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతపల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ మార్చాలి



అసెంబ్లీలో ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే

చింతపల్లి : చింతపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్‌ను మర్రిగూడ నుంచి కొండ మల్లేపల్లి సర్కిల్‌కు మార్చాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అసెంబ్లీలో ప్రస్తావించారు. చింతపల్లి పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని, చింతపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ప్రస్తుతం మునుగోడు నియోజకవర్గం, మర్రిగూడ మండలంలో ఉన్నందున పోలీసు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొండమల్లేపల్లి పోలీస్ సర్కిల్‌కు మార్చాలని ఆయన కోరారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించడంపై నాంపల్లి సర్కిల్ సీఐ విఠల్‌రెడ్డి, ఎస్‌ఐ రమేశ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభను వెలికి తీయడానికే టాలెంట్ టెస్ట్



హాలియాలో ఎస్‌ఎఫ్‌ఐ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



మోడల్ పరీక్ష ప్రశ్నా పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

హాలియా : విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, హాలియా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణ మూర్తి అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాగార్జున సాగర్ నియోజకవర్గ కార్యదర్శి కోరే రమేష్ ఆధ్వర్యంలో స్థానిక హాలియా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు షర్ఫొద్దీన్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ధనమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యులు ఆలేటి చందు, కళ్యాణ్, సాయి, పండు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడానికి మోడల్ పరీక్షలు ఎంతగానో మేలు చేస్తాయని, టూటౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ అన్నారు. ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ పరీక్షల ప్రశ్నా పత్రాలను విడుదల చేసి అనంతరం వారు మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ చదువు, పోరాటం అన్న స్ఫూర్తితో ముందు సాగుతూ ఇలాంటి ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, బక్కా శ్రీనివాసచారి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్వాయి శ్రీనివాస్, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రవినాయక్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కుర్ర సైదానాయక్, జగన్, వదూద్, సమద్, మోహన్, చందు, సాయి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధో సంపత్తి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఝాన్సీ, ఎంపీటీసీ మేక లలిత

మిర్యాలగూడ : పుస్తకాలు ఎక్కువగా చదవడం వల్ల ప్రతి ఒక్కరిలో మేధో సంపత్తి పెరుగుతుందని సర్పంచ్ వల్లంపట్ల ఝాన్సీప్రవీణ్ అన్నారు. ఆదివారం వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో తాళ్ల లింగయ్యసుగుణమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుమారులు ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ఎంపీటీసీ మేక లలితరవితో కలిసి ప్రారంభించి వారు మాట్లాడారు. గ్రంథాలయం ఏర్పాటుతో విద్యార్థులు చదువుపై దృష్టి పెడుతారన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఏర్పాటుచేసిన కుటుంబసభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కోల పాపయ్య, గ్రంథాలయ నిర్మాణ దాతలు తాళ్ల వెంకటేశ్వర్లు, సురేష్, చింతకాయల పున్నయ్య, వల్లంపటల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఎక్స్‌క్లూజివ్ స్టార్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు సేవానాయక్

మిర్యాలగూడ అర్బన్ : పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ మాలోతు సేవానాయక్‌కు మో ఆర్ట్ ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ ఎక్స్‌క్లూజివ్ స్టార్ అవార్డు–2023ను ప్రదానం చేశారు. హైదరాబాద్ నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును సంస్థ చైర్మన్ శ్రీనివాస్ అందజేశారు. ఉస్మానియా యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సాధించిన సేవానాయక్ యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గిరిజన తండాల్లోని విద్యార్థులకు ఆంగ్ల భాషపై మెళకువలు నేర్పి పరిజ్ఞానాన్ని మెరుగపర్చడంలో విశేషంగా కృషి చేస్తున్నందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఉపాధ్యాయుడు సేవానాయక్‌కు అవార్డు దక్కడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, యూత్ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థికి వెండి పతకం



వెండి పతకం సాధించిన యశ్వంత్‌రెడ్డి

మిర్యాలగూడ : బీహార్ రాష్ట్రం పాట్నాలోని పాటలీపుత్ర స్టేడియంలో నిర్వహిస్తున్న నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో దామరచర్లకు చెందిన కందుల యశ్వంత్‌రెడ్డి వెండి పతకాన్ని సాధించారు. ఆదివారం నిర్వహించిన అండర్–16 విభాగం 80మీటర్ల పరుగుపందెంలో యశ్వంత్ ప్రతిభ కనబరిచి వెండి పతకం పొందాడు. స్థానికంగా పదో తరగతి విద్యనభ్యసిస్తున్న యశ్వంత్‌రెడ్డి రన్నింగ్‌పై ఆసక్తి ఉండడంతో కోచ్ గడపరాజు శిక్షణ ఇచ్చారు. అండర్–16 విభాగంలో నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక చేసే ఈవెంట్‌కు పంపింది. యశ్వంత్‌రెడ్డి పతకం సాధించడంపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న రంజిత్ యాదవ్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ అన్నారు. మండలంలోని నెల్లికల్లు గ్రామంలో నిర్వహిస్తున్న యాదవుల కులదైవం శ్రీగంగమ్మ తల్లి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రంజిత్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవలని ఆయన సూచించారు. అనంతరం ఆయన అమ్మవారిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవకుల పెద్దలు రంజిత్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పమ్మి జనార్థన్‌రెడ్డి, పెద్ద వూర, సర్పంచ్‌లు నడ్డి లింగయ్య, సుంకిరెడ్డి ప్రభావతిరెడ్డి, కమిటీ సభ్యులుబుర్రి శ్రీను, రామయ్య, బాల నర్సింహా, నాగరాజు, కాశయ్య, హుస్సేన్, గోపి, సైదులు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులకు చెందిన తక్కెళ్లపల్లి కాశమ్మ, కొల్లి సూరమ్మ, కొమ్మరాజుల లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యతో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత కుందూరు జైవీర్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి చెందిన పలువురి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, పిల్లి ఆంజనేయులు, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, యడవెల్లి సోమశేఖర్, నకిరేకంటి సైదులు మాదిగ, బూరనాయక్ పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో ప్రభుత్వం విఫలం

మునుగోడు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు కేటాయించడంలో విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నరసింహ అన్నారు. ఆదివారం మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వం స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అర్హులైనవారికి తెల్లరేషన్ కార్డు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ బీమా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎండీ జహంగీర్, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఉప్పునూతల రమేష్, కాయతి వెంకన్న, సంఘం మండల నాయకులు దుబ్బ వెంకన్న, గోస్కొండ మారయ్య, బొలుగురు ఎల్లయ్య, ప్రసాద్, ఉప్పునూతల సునీల్, తేజ తదితరులు పాల్గొన్నారు.

చకిలం జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చకిలం అనిల్‌కుమార్

నల్లగొండ టూటౌన్ : దివంగత ఎమ్మెల్యే చకిలం శ్రీనివాసరావు శత జయంతి వేడుకలను ఈ నెల 20న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చకిలం అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం నల్లగొండలోని నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చకిలం అనిల్‌కుమార్ మాట్లాడారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు మనవడు ప్రభాకర్‌రావు, కేరళ ఐజీ నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. అన్నదానం, రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చకిలం అభిమానులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శతజయంతి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో సునీల్‌కుమార్, రమేష్, భిక్షపతి, సయ్యద్‌ఫిరోజ్ , సైదులు, రంజిత్‌కుమార్, భిక్షం, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అజ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 నుంచి 2002 సంవత్సరాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1988 సంవత్సరం నుంచి 2002 వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులు, చదువు నేర్పిన గురువులు అధిక సంఖ్యలో హాజరై వారి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరిన పూర్వ విద్యార్థులను చూసిన గురువుల ఆనందం వ్యక్తం చేశారు. తమ తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఒకరికొకరు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పరిపూర్ణ, శ్రీనివాస్, కేశవులు, పుల్లయ్య, లింగమూర్తి, తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఆదిరాల నగేష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మర్రిగూడ : మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఖుదభాక్షపల్లి, శివన్నగూడ భూ నిర్వాసితులు కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని వారికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, శివన్నగూడ ఎంపీటీసీ దాసరి మమతగోపాల్, ఐతగోని జంగయ్య, చాపల రవి, వెంకన్న, బలరాం, అబ్బయ్య, వెంకటయ్య, భాగ్యమ్మ, రాములు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కూసుకుంట్లతో భూ నిర్వాసితులు